## టీఎస్ స్థానంలో టీజీ అనే రాయాలి

### జిల్లా అధికారులకు కలెక్టర్ పమేలా సత్పతి ఆదేశం

కలెక్టరేట్, మే 18: తెలంగాణ సంక్షిప్త పదాన్ని టీఎస్‌కు బదులు టీజీగా ప్రస్తావించాలని రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయగా, వాటిని జిల్లాలోని అన్ని శాఖల ఉన్నతాధికారులు తక్షణమే అమలు చేయాలని కలెక్టర్ పమేలా సత్పతి ఆదేశించారు. జిల్లాలో ఇకపై అన్ని ప్రభుత్వ కార్యాలయాలు, సంస్థలు, ఏజెన్సీలు, పబ్లిక్ సెక్టార్ యూనిట్లు, ఏజెన్సీలు, స్వయంప్రతిపత్తి గల సంస్థలు, కార్పొరేషన్లు, వెబ్ సైట్‌లు, ఆన్‌లైన్ ప్లాట్ ఫారమ్‌లు.. ఏదైనా ఇతర అధికారిక కమ్యూనికేషన్లు సైతం తెలంగాణ కోడ్‌ను టీఎస్‌కు బదులుగా టీజీ వాడాలని కలెక్టర్ కోరారు. లెటర్ హెడ్లు, రిపోర్టులు, నోటిఫికేషన్లు, అధికారిక వెబ్‌సైట్లు, ఆన్‌లైన్ ప్లాట్ ఫార్మ్‌, పాలసీ పేపర్లు, జీవోలు, ఇతర అధికారిక కమ్యూనికేషన్లన్నింటిపై టీఎస్ స్థానంలో టీజీగా మార్చాలని సూచించారు. ఆయా శాఖల ద్వారా భవిష్యత్తులో నిర్వహించే ఉత్తర, ప్రత్యుత్తరాల్లో టీఎస్‌కు బదులుగా టీజీని ముద్రించాలని స్పష్టం చేశారు. ఈ మేరకు తీసుకున్న చర్యలపై 25లోగా అన్ని శాఖల జిల్లా అధికారులు తగిన నివేదికలు పంపాలని, వాటిని క్రోడీకరించి ప్రభుత్వానికి పంపనున్నట్లు, శనివారం విడుదల చేసిన ప్రకటనలో కలెక్టర్ తెలిపారు.

## యూనిఫాంలు సకాలంలో అందజేయాలి



శంకరపట్నంలో మహిళా శక్తి స్కీం సెంటర్‌ను ప్రారంభిస్తున్న డీపీఎం రవీందర్

శంకరపట్నం, మే 18: మహిళా శక్తి స్కీం సభ్యులు విద్యార్థుల స్కూల్ యూనిఫాంలు సకాలంలో అందజేయాలని సెర్ప్ డీపీఎం రవీందర్ తెలిపారు. శనివారం మండల కేంద్రంలో టీ-సెర్ప్, డీఆర్‌డీఏ ఆధ్వర్యంలో మహిళా శక్తి స్కీం స్టిచ్చింగ్ సెంటర్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, జూన్ 12న పాఠశాలలు పునః ప్రారంభం కానున్నందున జూన్ 7లోగా విద్యార్థుల స్కూల్ యూనిఫాంలు కుట్టి పాఠశాలల్లో అందేలా చూడాలని ఎస్‌హెచ్‌జీ సభ్యులను కోరారు. యూనిఫాం క్లాత్‌ను అందజేశారు. కార్యక్రమంలో ఏపీఎం సుధాకర్, సీసీలు సంపత్, రాజ్‌కుమార్, లక్ష్మీనారాయణ, అజీమ్, మండల సమాఖ్య అధ్యక్షురాలు అనిత, వీవోఏలు, మండల సమాఖ్య సిబ్బంది, మాస్టర్ కట్టర్‌లు పాల్గొన్నారు.

## ధర్మ పరిరక్షణలో మహిళలది కీలక పాత్ర


మహిళా శక్తిపై పాట పాడుతున్న మహిళా శక్తి సభ్యులు

శంకరపట్నం, మే 18: భారతీయ ధర్మ పరిరక్షణలో మహిళలది కీలక పాత్ర అని విశ్వహిందూ పరిషత్ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు డాక్టర్ సునీత పేర్కొన్నారు. శనివారం మండలంలోని కేశవపట్నం బ్రహ్మ విద్యాశ్రమంలో వీహెచ్‌పీ-మాతృశక్తి ఆధ్వర్యంలో మహిళలకు ఒకరోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, తల్లి తన సంతానానికి ఉగ్గు పాలను రంగరించి వ్యక్తిత్వ వికాసానికి బాటలు వేస్తుందన్నారు. మహిళలను శిక్షణ ద్వారా సుశిక్షితులను చేసి హిందూ ధర్మ విలువలు, సత్సంగం, దేవాలయాలు, సామూహిక పూజలు, పండుగల నిర్వహణ, తదితర వైదిక క్రతువుల నిర్వహణలో నిష్ణాతులుగా తీర్చిదిద్దుతున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో వీహెచ్‌పీ రాష్ట్ర సంయోజిక పద్మశ్రీ, సహ సంయోజిక లక్ష్మీసరోజినీ, ఉప్పల్ సంయోజిక ఉషారాణి, జిల్లా సంయోజిక సంగీత, మండల గౌరవాధ్యక్షుడు తనుకు ఓంకారం, మండల కార్యదర్శి వెంకటేశం, కర్మకొండ రాజయ్య, మాతృశక్తి సభ్యులు పాల్గొన్నారు.

# గ్రూప్-1 ప్రిలిమినరీకి పకడ్బందీ ఏర్పాట్లు


సమీక్షా సమావేశంలో పాల్గొన్న కలెక్టర్ పమేలా సత్పతి, అదనపు కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్

- పరీక్ష కేంద్రాల్లో అన్ని వసతులు కల్పించాలి
- సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలి
- ఎలక్ట్రానిక్ వస్తువులను అనుమతించవద్దు
- టీఎస్‌పీఎస్‌సీ చైర్మన్ మహేందర్ రెడ్డి
- వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జిల్లా కలెక్టర్లు, పోలీసు అధికారులతో సమీక్ష

కమాన్‌చౌరస్తా, మే 18: జూన్ 9న జరుగనున్న గ్రూప్-1 ప్రిలిమినరీ ఎగ్జామ్‌కు అధికారులు పకడ్బందీగా ఏర్పాట్లు చేపట్టాలని టీఎస్‌పీఎస్‌సీ చైర్మన్ మహేందర్ రెడ్డి ఆదేశించారు. గ్రూప్-1 ప్రిలిమినరీ ఎగ్జామ్‌కు సంబంధించిన ఏర్పాట్లపై శనివారం అన్ని జిల్లాల కలెక్టర్లు, సీపీలు, ఎస్పీలు, డీసీపీలతో హైదరాబాద్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. కరీంనగర్ కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్ నుంచి కలెక్టర్ పమేలా సత్పతి, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్, డీసీపీ (లా అండ్ ఆర్డర్) లక్ష్మీనారాయణ వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా టీఎస్‌పీఎస్‌సీ చైర్మన్ మహేందర్ రెడ్డి మాట్లాడుతూ, పరీక్ష ప్రశాంతంగా, పారదర్శకంగా జరిగేలా కలెక్టర్లు, ఎస్పీలు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని సూచించారు. ఎలాంటి తప్పిదాలు జరుగకుండా చూసుకోవాలని, నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే మాత్రం కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. పరీక్ష కేంద్రాల్లో అభ్యర్థులు ఇబ్బందులు పడకుండా అన్ని వసతులు కల్పించాలని పేర్కొన్నారు. తగిన నిఘా వ్యవస్థను కూడా ఏర్పాటు చేసుకోవాలని, ఈ మేరకు సీసీ కెమెరాలు అమర్చాలని సూచించారు. సెల్ ఫోన్లతోపాటు ఎలక్ట్రానిక్ వస్తువులను పరీక్ష కేంద్రాల్లోకి ఎట్టి పరిస్థితుల్లోనూ అనుమతించవద్దని ఆదేశించారు. కలెక్టర్లు పోలీస్ శాఖ అధికారులతో సమన్వయం చేసుకుంటూ ఆయా పరీక్ష కేంద్రాల్లో తగిన బందోబస్తు ఏర్పాటు చేయాలని తెలిపారు. ఓఎంఆర్ షీట్లు, ప్రశ్న పత్రాలను ఆయా పోలీస్ హెడ్ క్వార్టర్లలో తగిన బందోబస్తు మధ్య ఉంచాలని పేర్కొన్నారు. పరీక్ష కేంద్రాలకు వాటిని జాగ్రత్తగా తీసుకెళ్లాలని, పరీక్ష కంటే ముందు ఇన్ టైంలో చేరేలా చూడాలని సూచించారు. జూన్ 9న 10:30 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు పరీక్ష జరుగుతుందని తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి అభ్యర్థులను కేంద్రాల్లోకి అనుమతించాలని, అభ్యర్థులను క్షుణ్ణంగా తనిఖీ చేయాలని సూచించారు. అభ్యర్థులు ఇన్విజిలేటర్లు సెల్‌ఫోన్లు తీసుకెళ్లకుండా ప్రత్యేక దృష్టి సారించాలని వివరించారు. పరీక్షలకు సంబంధించి ఎలాంటి మాస్ కాపీయింగ్, పేపర్ లీకేజీ జరుగకుండా పకడ్బందీగా వ్యవహరించాలని తెలిపారు. రీజినల్ కోఆర్డినేటర్స్ చీఫ్ సూపరింటెండెంట్లు పరీక్ష ముగిసే సమయం వరకు అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. పరీక్ష కేంద్రాల్లో నిరంతరాయంగా విద్యుత్ సరఫరా, మెడికల్ సిబ్బంది అందుబాటులో ఉండేలా చూడాలని పేర్కొన్నారు.

**జిల్లాలో 18,663 మంది అభ్యర్థులు..**

కరీంనగర్‌లో గ్రూప్-1 ప్రిలిమినరీ ఎగ్జామ్‌కు 36 కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నామని కలెక్టర్ పమేలా సత్పతి తెలిపారు. గ్రూప్-1 పరీక్ష ఏర్పాట్లపై వీసీ అనంతరం అధికారులతో కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, జిల్లాలో మొత్తం 18,663 మంది అభ్యర్థులు పరీక్ష రాయనున్నారని తెలిపారు. అభ్యర్థుల బయోమెట్రిక్ వెరిఫికేషన్ క్షుణ్ణంగా నిర్వహించాలని సూచించారు. మే 22న హైదరాబాద్‌లో బయోమెట్రిక్ పోలీస్ ఆఫీసర్లు, పోలీస్ నోడల్ ఆఫీసర్లకు శిక్షణ కార్యక్రమం ఉంటుందని చెప్పారు. పరీక్ష కేంద్రాల్లో గట్టి నిఘా వ్యవస్థను ఏర్పాటు చేయాలని సూచించారు. టీఎస్ పీఎస్‌సీ నిబంధనలకు అనుగుణంగా పరీక్ష జరిగేలా చూడాలని తెలిపారు. దివ్యాంగులు, అంధ అభ్యర్థులకు ప్రత్యేక గదులు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్, డీఆర్‌వో పవన్ కుమార్, డీసీపీ (లా అండ్ ఆర్డర్) లక్ష్మీనారాయణ, జగిత్యాల జేఎన్‌టీయూ కళాశాల ప్రొఫెసర్ బీ సతీశ్ కుమార్, ఎస్బీ ఇన్‌స్పెక్టర్ సృజన్ రెడ్డి, కలెక్టరేట్ సూపరింటెండెంట్ కాళీ చరణ్, కరీంనగర్ ఉమెన్స్ కాలేజ్ ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ శ్రీధర్ రావు, రజినీ పాల్గొన్నారు.

## కాంగ్రెస్ మోసాలను ఎండగడతాం

- లోక్‌సభ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ అభ్యర్థి కొప్పుల గెలుపు ఖాయం
- మాదిగ జేఏసీ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు వాసంపల్లి ఆనంద్‌బాబు


కొప్పుల ఈశ్వర్‌తో ఆనంద్‌బాబు

కోల్‌సిటీ, మే 18: ఆరు గ్యారెంటీలతో ప్రజలను మోసం చేసిన కాంగ్రెస్ పార్టీని ప్రజాక్షేత్రంలో ఎండగడతామని మాదిగ జేఏసీ ఉమ్మడి కరీంనగర్ జిల్లా అధ్యక్షుడు డా.వాసం పల్లి ఆనంద్‌బాబు అన్నారు. గోదావరిఖనిలో బీఆర్‌ఎస్ పెద్దపల్లి ఎంపీ అభ్యర్థి, మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్‌ను శనివారం కలిసి గెలుపు ధీమా వ్యక్తం చేశారు. లోక్‌సభ ఎన్నికల్లో ప్రజలంతా బీఆర్‌ఎస్ వైపే నిలిచారనీ, కాంగ్రెస్ ఓట్లు చీలడానికి గల కారణం ప్రజల్లో ఉన్న వ్యతిరేకతేనని అన్నారు. కాంగ్రెస్ పార్టీపై ప్రజల్లో నమ్మకం పోయిందనీ, గత అసెంబ్లీ ఎన్నికల్లో అరచేతిలో స్వర్గం చూపిస్తూ 402 హామీలు ఇవ్వడంతో ప్రజలు నమ్మి ఓటు వేశారని గుర్తు చేశారు. అతి తక్కువ సమయంలోనే ప్రజలు తప్పు చేసినట్లు గుర్తించారన్నారు. మా దిగలకు అన్యాయం చేసిన కాంగ్రెస్‌ను ఓడించేందుకే బీఆర్‌ఎస్‌కు మద్దతు తెలిపామని చెప్పారు. ఎన్నికల అనంతరం కాంగ్రెస్ అభ్యర్థి అడ్రస్ లేకుండా పోయాడని, బీఆర్‌ఎస్ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్ ప్రజల్లోనే ఉన్నాడనీ, ఈ తేడాను ప్రజలు గుర్తించే బీఆర్‌ఎస్‌కు ఓటు వేశారన్నారు. ఆయన వెంట సీనియర్ నేత పీటీ స్వామి తదితరులు ఉన్నారు.

## తాడే ఆధారం.. నిచ్చెనే ఊతం!


చామనపల్లిలో వంగిన విద్యుత్ స్తంభం

కరీంనగర్ రూరల్, మే 18: చామనపల్లి గ్రామంలో ఎల్లమ్మ దేవాలయానికి వెళ్లే దారిలో ఇటీవల ఈదురు గాలులతో కూడిన వర్షానికి విద్యుత్ స్తంభం వంగిపోయి ప్రమాదకరంగా మారింది. దాదాపు 15 రోజులు గడిచినా సరి చేసే వారు కరువవడంతో స్థానికులు వంగిన విద్యుత్ స్తంభం కింద పడకుండా తాడు కట్టి, ఊతంగా నిచ్చెన పెట్టారు. ఎలాంటి ప్రమాదం జరుగకముందే విద్యుత్ అధికారులు స్పందించి మరమ్మతులు చేయించాలని కోరారు.

## వేంకటేశ్వరస్వామి కల్యాణానికి ఎమ్మెల్యే హాజరు


వీణవంక శ్రీలక్ష్మీ వేంకటేశ్వరస్వామి కల్యాణానికి హాజరైన హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి

వీణవంక, మే 18: మండల కేంద్రంలోని శ్రీలక్ష్మీ వేంకటేశ్వరస్వామి కల్యాణ మహోత్సవం శనివారం రాత్రి వైభవంగా జరుగగా, హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి హాజరై ప్రత్యేక పూజలు చేశారు. ఏటా వీణవంకలో జరిగే శ్రీలక్ష్మీ వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా స్వామి వారి కల్యాణం ప్రముఖ వేదపండితుడు గూడ జగదీశ్వరశర్మ ఆధ్వర్యంలో నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరై స్వామివారి కల్యాణాన్ని వీక్షించి, మొక్కులు చెల్లించుకున్నారు. గ్రామం సుభిక్షంగా ఉండాలని ఏటా స్వామివారి కల్యాణం జరిపించడం హర్షణీయమని ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి పేర్కొన్నారు. కార్యక్రమంలో వైస్‌ఎంపీపీ రాయిశెట్టి లత-శ్రీనివాస్, మాజీ సర్పంచ్ నీల కుమారస్వామి, ఆలయ అర్చకుడు సతీశ్, గోవిందమాలధారణ స్వాములు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలి

తెలంగాణచౌక్, మే 18: ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని బీసీ సంక్షేమ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి దొగ్గలి శ్రీధర్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. నగరంలోని సంఘ కార్యాలయంలో శనివారం నిర్వహించిన ముఖ్యకార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ఫీజు రీయింబర్స్‌మెంట్ చెల్లింపులో జాప్యంతో కళాశాల యాజమాన్యాలు ఫీజుల కోసం విద్యార్థుల మీద ఒత్తిడి తీసుకొస్తున్నాయని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు విద్యార్థులకు పెండింగ్‌లో ఉన్న రూ.144 కోట్లను విడుదల చేయాలన్నారు. అలాగే బీసీ వసతి గృహాల్లో మౌలిక వసతులు కల్పించాలన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం విద్యార్థుల సమస్యలను పరిష్కరించకుంటే దశల వారీగా ఆందోళన చేపడుతామని హెచ్చరించారు. సమావేశంలో నాయకులు రాజు, ప్రశాంత్ పాల్గొన్నారు.

## రైతులను ఆదుకోవాలి

తెలంగాణచౌక్, మే 18: అకాల వర్షంతో పంట నష్టపోయిన రైతులను ఆదుకోవాలని తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం జిల్లా కార్యదర్శి పైడిపల్లి రాజు రాష్ట్ర ప్రభుత్వాన్ని శనివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. అకాల వర్షంలో పండ్ల తోటలు పూర్తిగా నేల మట్టమై తీవ్ర నష్టం వాటిల్లిందని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు క్షేత్ర స్థాయిలో పంటలను పరిశీలించి ప్రభుత్వానికి నివేదిక అందించాలని కోరారు. సన్న, దొడ్డు రకం తేడా లేకుండా ధాన్యం పండించిన రైతులందరికీ రూ.500 బోనస్ అందించాలని డిమాండ్ చేశారు.

## స్నేహితుడి కుటుంబానికి చేయూత


రేణుకకు డిపాజిట్ బాండ్ అందజేస్తున్న రవీందర్ స్నేహితులు

హుజూరాబాద్ రూరల్, మే 18: హుజూరాబాద్ పట్టణంలో నివాసం ఉంటున్న పెంచికల్‌పేటకు చెందిన ఆర్‌ఎంపీ ఇప్పలపల్లి రవీందర్ నెల క్రితం శాలపల్లి-ఇందిరానగర్ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన విషయం తెలిసిందే. ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న అతడి కుటుంబానికి స్నేహితులు చేయూతనందించారు. రవీందర్‌కు భార్య రేణుక, ఇద్దరు పిల్లలు ఉండడంతో వారి భవిష్యత్తు అవసరాల కోసం తలాకొంత విరాళం వేసుకొని రూ.1,20,500 పోగు చేశారు. ఆ మొత్తాన్ని రేణుక పేరు మీద ఫిక్స్డ్ డిపాజిట్ చేసి శనివారం ఆమెకు బాండ్ అందజేశారు. ఇక్కడ టీ రమేశ్, శ్రీనివాస్ గోవర్ధన్, పరమేశ్, జ్ఞానేశ్వర్, రాజారెడ్డి తదితరులు ఉన్నారు.

## రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి


సమ్మయ్య(ఫైల్)

హుజూరాబాద్ రూరల్, మే18: మండలంలోని శాలపల్లి-ఇందిరానగర్ వద్ద జమ్మికుంట-హుజూరాబాద్ ప్రధాన రహదారిపై శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందారు. స్థానికుల కథనం ప్రకారం.. చెల్పూర్ గ్రామానికి చెందిన మండల సమ్మయ్య(55) తన వ్యక్తిగత పనుల మీద సైకిల్‌పై ఇందిరానగర్‌కు వెళ్లాడు. పనులు ముగించుకొని తిరిగి వస్తుండగా జమ్మికుంట నుంచి హుజూరాబాద్ వైపు వస్తున్న బొలెరో వాహనం వెనుక నుంచి ఢీకొన్నది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన సమ్మయ్య అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. సమ్మయ్యకు భార్య, నలుగురు కుమారులు ఉన్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు టౌన్ సీఐ రమేశ్ తెలిపారు.

## 'పోరెడ్డి' మృతి కళారంగానికి తీరని లోటు

హుజూరాబాద్ రూరల్, మే18: పెద్దపాపయ్యపల్లి గ్రామానికి చెందిన సీనియర్ రంగస్థల నటుడు పోరెడ్డి శ్రీనివాస్ రెడ్డి మృతి కళారంగానికి తీరని లోటని తెలంగాణ రంగస్థల కళాకారుల సంఘం గౌరవాధ్యక్షుడు, కళారవళి సోషియో కల్చరల్ అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ విష్ణుదాస్ గోపాల్ రావు పేర్కొన్నారు. ఈ నెల 17న అనారోగ్యంతో శ్రీనివాస్ రెడ్డి మృతి చెందగా, శనివారం పెద్దపాపయ్యపల్లి గ్రామంలో జరిగిన అంత్యక్రియల్లో గోపాల్ రావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ రెడ్డి కళారంగానికి చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో రాగమయూరి సంస్థ అధ్యక్ష కార్యదర్శులు వెంపటి సదానందం, మంచికట్ల రమేశ్, కళారవళి సంస్థ ప్రచార కార్యదర్శి ఇంద్రకరణ్, నటులు ప్రభాకర్, బండ కిషన్, రాంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఉన్నత శిఖరాలు అధిరోహించాలి

వేములవాడ రూరల్, మే 18: విద్యార్థులు ఉన్నత శిఖరాలు అధిరోహించాలని శాతవాహన యూనివర్సిటీ వీసీ మల్లేశ్ పేర్కొన్నారు. వేములవాడ మండలం అగ్రహారం డిగ్రీ కళాశాలలో పూర్వ విద్యార్థుల అసోసియేషన్ ఆర్థిక సహకారంతో కళాశాల అకాడమిక్ ఆధ్వర్యంలో అకాడమిక్ ఫెస్టివల్, బంగారు పతకాల ప్రదానోత్సవాన్ని శనివారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి వీసీ మల్లేశ్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ప్రతి విద్యార్థి రోజుకూ కనీసం ఐదు నుంచి ఆరు గంటలు చదివితే లక్ష్యాన్ని చేరుకోగలరన్నారు. రానున్న పీజీ ప్రవేశ పరీక్షల్లో విజయం సాధించేలా సన్నద్ధం కావాలన్నారు. అనంతరం అకాడమిక్ పరీక్షల్లో ప్రతిభ చూపిన విద్యార్థులు పున్నశాస్త్రి, సనా, అరుణ్, మేహ, నందిని, రేవతి, రిషీంద్ర, కేజీయా, రజిత, సౌజన్య, సౌమ్య, భార్గవి, రాజు, రఘుప్రసాద్‌కు బంగారు పతకాలు అందించారు.

## ఉపాధిహామీ కూలీలకు తట్టల పంపిణీ

కొత్తపల్లి, మే 18: ఉపాధిహామీ కూలీలకు శనివారం మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ రాజశేఖర్ తట్టలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో రాచమల్ల రాజిరెడ్డి, తాండ్ర నారాయణ, ఉప్పు శంకర్, మిట్ట లక్ష్మయ్య, తిరుపతి, ప్రభాకర్, రాజశేఖర్, నరేశ్, దుర్గం ప్రశాంత్ పాల్గొన్నారు.

## శిక్షణలో నేర్చుకున్న అంశాలను ఆచరణలో పెట్టాలి


ప్రజ్ఞ వేసవి శిక్షణ శిబిరం ముగింపు కార్యక్రమంలో మాట్లాడుతున్న డీఈవో జనార్దన్ రావు

కమాన్‌చౌరస్తా, మే 18 : ప్రతి విద్యార్థి నేర్చుకున్న విలువైన అంశాలను నిత్యజీవితంలో ఆచరణలో పెట్టాలని, అప్పుడే శిక్షణకు సార్థకత ఉంటుందని డీఈవో జనార్దన్ రావు పేర్కొన్నారు. వికాసతరంగిణి (127), జెట్ ఆధ్వర్యంలో సప్తగిరికాలనీ కోదండరామాలయంలో ఈ నెల 3న ప్రారంభమైన ప్రజ్ఞ వేసవి శిక్షణ శిబిరం శనివారం ముగిసింది. ఈ సందర్భంగా డీఈవో ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. శిక్షణలో ప్రతిభ చూపిన విద్యార్థులకు బహుమతులు అందజేసి అభినందించారు. కార్యక్రమంలో గాంధీ పేపర్ మార్ట్ అధినేత జోగినపల్లి రఘునందన్ రావు, వికాస తరంగిణి జిల్లా అధ్యక్షుడు కే గౌతమరావు, ప్రజ్ఞ కో ఆర్డినేటర్ శ్రీదేవి, శ్రీహరిరెడ్డి, రాజిరెడ్డి, విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## మానసిక వేదనతో ఆత్మహత్య

రాంనగర్, మే 18: మానసిక వేదనకు గురై ఆత్మహత్యకు యత్నించిన వ్యక్తి చికిత్స పొందుతూ హైదరాబాద్‌లోని గాంధీ దవాఖానలో మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కాపువాడకు చెందిన మంద నరేశ్ (38)కు పుట్టుకతోనే గ్రహణ మొర్రి వల్ల మాటలు సరిగా వచ్చేవి కావు. పెళ్లయిన కొద్ది రోజులకే భార్య విడాకులు తీసుకొని వెళ్లిపోవడంతో ఒంటరిగా ఉంటూ మద్యానికి బానిసయ్యాడు. ఈ క్రమంలో తల్లి కూడా అనారోగ్యానికి గురి కావడంతో ఈనెల 9న మద్యంలో పురుగుల మందు కలుపుకొని తాగి ఆత్మహత్యకు యత్నించాడు. కుటుంబ సభ్యులు గమనించి మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్ గాంధీ దవాఖానకు తరలించారు. వారం పాటు చికిత్స పొందిన నరేశ్ శుక్రవారం మృతి చెందాడు. అతడి తండ్రి భూమయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ సరిలాల్ తెలిపారు.

## హోటళ్లపై సివిల్ సప్లయ్ దాడులు

విద్యానగర్, మే 18: కరీంనగరంలోని వివిధ ప్రాంతాల్లో ఉన్న హోటళ్లు, మెస్‌లు, చికెన్ సెంటర్లపై శనివారం సివిల్ సప్లయ్ అధికారులు దాడులు నిర్వహించారు. నగరంలోని కోతిరాంపూర్, కట్టరాంపూర్, భగత్‌నగర్, జ్యోతినగర్, కోర్టు చౌరస్తా తదితర చోట్ల కొనసాగిన ఈ దాడుల్లో గృహ అవసరాలకు వాడుకునే సిలిండర్లను హోటళ్లు, మెస్‌లు, చికెన్ సెంటర్లలో వినియోగిస్తున్నట్లు గుర్తించారు. ఈ సందర్భంగా ఎనిమిది సిలిండర్లను అధికారులు స్వాధీనం చేసుకున్నారు. దాడుల్లో పాల్గొన్న డీఎస్‌వో సురేశ్ రెడ్డి మాట్లాడుతూ, గృహ అవసరాలకు వాడుకునే సిలిండర్లను కమర్షియల్‌గా వినియోగించొద్దని స్పష్టం చేశారు. ఈ దాడుల్లో డిప్యూటీ తహసీల్దార్లు సురేందర్, వేణుగోపాల్, వసంతరావు, ఉషా, ఫుడ్ ఇన్‌స్పెక్టర్లు కమలేశ్, వినోద్ తదితరులు పాల్గొన్నారు.

## విదేశీ విద్యానిధికి దరఖాస్తుల ఆహ్వానం

కలెక్టరేట్, మే 18 : విదేశాల్లో చదివే గిరిజన విద్యార్థులు 2024-25 సంవత్సరానికి ఉపకార వేతనాల కోసం దరఖాస్తు చేసుకోవాలని జిల్లా గిరిజనాభివృద్ధి అధికారి డి.జనార్దన్ తెలిపారు. పీహెచ్‌డీ, పోస్ట్, డాక్టోరల్ రిసెర్చ్ ప్రోగ్రాంలో చదువుకునే గిరిజన విద్యార్థులు మాత్రమే విదేశీ విద్యానిధి పథకం ద్వారా ఉపకార వేతనం పొందేందుకు అర్హులని పేర్కొన్నారు. అర్హత, ఆసక్తి కలిగిన విద్యార్థులు ఈనెల 31లోగా http;//overseas.trubal.gov.in/వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని శనివారం విడుదల చేసిన ప్రకటనలో పేర్కొన్నారు.

## ముగింపు దశకు ధాన్యం కొనుగోళ్లు


చెర్లభూత్కూర్‌లో ధాన్యం కొనుగోళ్లు పూర్తికావడంతో కేంద్రంలోని తూకం యంత్రం, ఇతర సామగ్రిని తరలిస్తున్న కూలీలు

కరీంనగర్ రూరల్, మే 18: కరీంనగర్ మండల పరిధిలోని దుర్శేడ్ వ్యవసాయ పరపతి సహకార సంఘం పరిధిలో ధాన్యం కొనుగోళ్లు ముగిశాయి. దుర్శేడ్ సింగిల్ విండో పరిధిలోని మొగ్దుంపూర్, చేగుర్తి, దుర్శేడ్, గోపాల్‌పూర్, నల్లగుంటపల్లి, ఇరుకుల్ల గ్రామాల్లో సెంటర్లను ఏర్పాటు చేసి, దాదాపు 46 వేల క్వింటాళ్ల ధాన్యం సేకరించినట్లు చైర్మన్ తోట తిరుపతి తెలిపారు. కాగా, కరీంనగర్ సింగిల్ విండో పరిధిలోని చామనపల్లి, చెర్లభూత్కూర్, జూబ్లీనగర్, దుబ్బపల్లి, కొత్తపల్లి మండల పరిధిలోని నాగుల మల్యాల, ఎలగందుల, ఆరెపల్లి గ్రామాల్లో ధాన్యం కొనుగోళ్లు సోమవారంతో ముగిసే అవకాశం ఉందని నిర్వాహకులు తెలిపారు. కరీంనగర్ మండలంలోని నగునూర్, బొమ్మకల్, కొత్తపల్లి మండలంలోని కమాన్‌పూర్ గ్రామాల్లో మాత్రం మరో వారం పాటు కొనుగోలు కేంద్రాలు కొనసాగుతాయని చెప్పారు. కరీంనగర్ సింగిల్ విండో పరిధిలో ఇప్పటి వరకు దాదాపు లక్షా ఆరు వేల క్వింటాళ్ల ధాన్యం సేకరణ చేశామని సీఈవో రమేశ్ తెలిపారు. నాగుల మల్యాల, నగునూర్, బొమ్మకల్ సెంటర్లకు ఇంకా ధాన్యం వస్తున్నందున్న మరో వారం పాటు కేంద్రాలు కొనసాగే అవకాశం ఉందని చైర్మన్ పెండ్యాల శ్యాంసుందర్ రెడ్డి వెల్లడించారు.

# నిరంతర నీటి సరఫరాకు కసరత్తు

- పైలెట్ ప్రాజెక్ట్‌గా నగరంలోని హౌసింగ్‌బోర్డు రిజర్వాయర్ ఎంపిక
- రూ.18 కోట్లతో పనులు
- ఇప్పటికే 4,455 నల్లా కనెక్షన్లకు మీటర్లు
- జూన్ నుంచి 24 గంటల పాటు తాగునీరందించేందుకు చర్యలు

*స్మార్ట్‌సిటీ ప్రాజెక్టులో భాగంగా కరీంనగర్‌లో ప్రతి ఇంటికీ నిరంతర నీటి సరఫరా అందించే దిశగా నగరపాలక సంస్థ కసరత్తు చేస్తున్నది. ముందుగా నగరంలోని హౌసింగ్‌బోర్డు కాలనీ రిజర్వాయర్ పరిధిలో పైలెట్ ప్రాజెక్ట్‌గా దీనిని ప్రారంభించేందుకు ప్రణాళికలు రూపొందించింది. ఇందుకు సంబంధించి క్షేత్రస్థాయిలో పనులన్నీ ఇప్పటికే తుది దశకు చేరుకోగా, వాటిని యుద్ధప్రాతిపదికన పూర్తి చేయించడంపై అధికార యంత్రాంగం దృష్టి సారించింది.*

**- కార్పొరేషన్, మే 18**

నగరంలో మూడు రిజర్వాయర్లు ఉండగా, 24 గంటల మంచినీటి సరఫరా కోసం హౌసింగ్ బోర్డు రిజర్వాయర్‌ను పైలెట్ ప్రాజెక్టుగా ఎంపిక చేశారు. ఏడాదిగా ఇందుకు అవసరమైన పనులు చేపడుతున్నారు. రూ.18 కోట్ల వ్యయంతో ఈ పనులను ప్రారంభించారు. ఈ పనుల్లో భాగంగా ఈ రిజర్వాయర్ పరిధిలో నూతన పైప్‌లైనింగ్, వాల్స్, మీటర్లు తదితర పనులు చేపడుతున్నారు. ఇప్పటికే ఈ పనులు తుది దశకు చేరాయి. ఈ రిజర్వాయర్ పరిధిలోని 4,455 నల్లా కనెక్షన్లకు మీటర్లను కూడా బిగించారు. మరో సుమారు 16వందలకు పైగా నల్లా కనెక్షన్లకు మీటర్లు బిగించాల్సి ఉంది. వీటితో పాటు ఆయా ఏరియాల వారీగా ఏర్పాటు చేసిన పైప్‌లైన్స్‌కు వాల్స్‌తో పాటు, నీటి సరఫరాను లెక్క కట్టేందుకు అవసరమైన మీటర్లను కూడా ఏర్పాటు చేస్తున్నారు. ఈ పనులన్నింటినీ సాధమైనంత త్వరగా పూర్తి చేసేందుకు నగరపాలక అధికారులు చర్యలు చేపడుతున్నారు. ఈ పనులు పూర్తి కాగానే ఈ రిజర్వాయర్ పరిధిలో 24 గంటల మంచినీటి సరఫరా ప్రారంభించనున్నారు.

**వచ్చే నెలలో ప్రారంభించేందుకు ప్రణాళికలు**

హౌసింగ్‌బోర్డు రిజర్వాయర్ పరిధిలో జూన్ నుంచి 24 గంటల మంచినీటి సరఫరా చేసే దిశగా అధికారులు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు. ఈ దిశగానే మిగిలిన పనులను పూర్తి చేసేందుకు అన్ని చర్యలు చేపడుతున్నారు. ప్రస్తుతం నగరానికి మంచినీటి సరఫరా అందిస్తున్న ఎల్‌ఎండీ డ్యాంలో నీటి మట్టం తక్కువగా ఉండడంతో నగర వ్యాప్తంగా రోజు తప్పించి రోజు మంచినీటి సరఫరా చేస్తున్నారు. వేసవికి ముందు నగరవ్యాప్తంగా ప్రతిరోజూ నగరపాలక సంస్థ మంచినీటి సరఫరా చేపట్టింది. కాగా, జూన్ నుంచి వర్షాలు ప్రారంభం అయితే ఎల్‌ఎండీలో నీటి మట్టం పెరుగుతుందని అధికారులు అంచనా వేస్తున్నారు. అనంతరం నగరంలో రోజు మంచినీటి సరఫరా చేయడంతో పాటు హౌసింగ్‌బోర్డు కాలనీలో 24 గంటల మంచినీటి సరఫరా చేసేందుకు చర్యలు తీసుకుంటున్నారు. జూన్ చివరి నాటికి 24 గంటల మంచినీటి సరఫరా పైలెట్ ప్రాజెక్టును ప్రారంభించాలన్న లక్ష్యంతో పనులు సాగుతున్నాయని అధికారవర్గాలు తెలిపాయి.


హౌసింగ్‌బోర్డు కాలనీ రిజర్వాయర్

నమస్తే తెలంగాణ CLASSIFIED

WANTED

jobs Apply Now!

★ ఒమేగా హోంకేర్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను, పిల్లలను చూసుకొనుటకు, ఇంటిపని, వంటపని చేయుటకు వర్కర్స్, నర్సులు కావలెను. ఉచిత వసతి, భోజనం. జీతం: 20K. Ph: 8977639662 / 8977639663.
NT-327714-All

CHANGE OF NAME

★ I, KALAGIRI MOUNIKA, D/o. Kalagiri Bhoomanna, R/o. 2-22/2, Ramajipet, Raikal, Jagityal, TS. I have Changed after Marriage My Name as AILNENI MOUNIKA, W/o. Ailneni Rajkumar.
NT-334204

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధము లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

Classified Ads
మీకు కావలసిన సమాచారం కొరకు సులభమైన మార్గం.. మన నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వడం
4 లైన్ల ప్రకటన కేవలం 200/- మాత్రమే
ప్రతి ఎక్స్‌ట్రా లైన్‌కి 50/- మాత్రమే
3+1 స్కీం కలదు
ప్రకటనల విభాగం...
GST 5% వర్తించును
Cell: 91827 77571
91827 77194